**చర్చకోసం**

# రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధి కోసం ఏకైక చివరి అవకాశం. ఇప్పుడు మేల్కొనకపోతే భవిష్యత్తు శూన్యమే!

**వెనుకబడిన ప్రాంతాల సమతుల అభివృద్ధి ప్రణాళిక కోసం ఒక సాధికార కమీషన్‌ను వెంటనే వేయాలి.**

**డాII వై.వి.మల్లా రెడ్డి**

**Date: 25.09.2015**

## 1. పరిచయము:

## ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టము 2014లోని క్లాజులు:

94(1) రెండు రాష్ట్రాలలోను పరిశ్రమలు స్థాపించడానికి, ఆర్థికాభివృద్ధి సాధించడానికి పన్ను మినహాయింపులతో సహా తగిన ఆర్థిక చర్యలు రెండు రాష్ట్రాలలోనూ కేంద్ర ప్రభుత్వము చేపడుతుంది.

94(2) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం భౌతిక, సాంఘిక, మౌలిక సదుపాయాల కల్పనతో సహా అవసరమైన ఇతర కార్యక్రమాలను, కేంద్ర ప్రభుత్వము చేపడుతుంది.

పై రెండు క్లాజుల ముఖ్య ఉద్దేశము రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసి, సమతుల, సమగ్ర అభివృద్ధితో పాటు, ప్రాంతీయ సమన్యాయం సాధించడం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా (స్పెషల్ కేటగిరీ స్టేటస్) యిస్తామని అప్పటి ప్రధాని శ్రీ మన్‌మోహన్ సింగ్ చేసిన ప్రకటనతో పాటు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వము నడుపుతున్న బి.జె.పి. కూడా 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా యిస్తామని పదే పదే ప్రకటనలు చేస్తూ వారి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగింది.

రాష్ట్ర విభజన చట్టములోని పై రెండు క్లాజులు మరియు రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో లభించే వెసులుబాటును కలుపుకొని రాయలసీమ మరియు ఉత్తరాంధ్రల వెనుకబాటును అధిగమించి సమతుల అభివృద్ధి సాధించడానికి అరుదైన అవకాశాలు కల్పిస్తున్నాయి. పునర్వ్యవస్థీకరణ చట్టములోనే ఇటువంటి వెసులుబాటు ఉండడం మరియు పాలక, ప్రతిపక్షాలు రెండూ కూడా ప్రత్యేక హోదాకు అనుకూలంగా వుండడం ఒక అరుదైన అవకాశం. ఈ అరుదైన అవకాశాన్ని పోగొట్టుకుంటే, తిరిగి ఇటువంటి అవకాశము మరెప్పుడూ రాకపోవచ్చు.

అయితే ప్రభుత్వపరంగా  ఈ అరుదైన అవకాశానికి సంబంధించి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి దిశగా కార్యాచరణ లేకపోవడం చాలా దురదృష్టం. ఈ అవకాశం రాయలసీమకు, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాకు మరియు ఉత్తరాంధ్ర జిల్లాలకు వున్న ఒక్కగానొక్క అవకాశం. ఈ అవకాశాన్ని జార విడుచుకుంటే, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలభవిష్యత్తు అంధకారమే. దేశంలోనే అత్యంత వెనుకబాటుకు, నిర్లక్ష్యానికి గురైన అనంతపురము జిల్లా అభివృద్ధి గురించి ఇక ముందుకు ప్రస్తావించవలసిన అవసరం కూడా ఉండకపోవచ్చు.

మన రాష్ట్రంలో విభజనకు ముందుగానీ, తరువాతగానీ వెనుకబడిన ప్రాంతాల సమతుల అభివృద్ధి కోసం ఒక సమగ్ర ప్రణాళిక లేదు. అవి ఎందుకు వెనుకబడి వున్నాయో, మూల కారణాలేమో శాస్త్రీయంగా నిపుణులతో సమగ్ర విశ్లేషణ కూడా లేదు. ఎక్కడికి చేరాలనే గమ్యం తెలియనపుడు, ఏ బస్సునైనా ఎక్కవచ్చు అనే నానుడిలాగా ఎవరికి తోచింది వారు ఏదో కావాలని ప్రభుత్వాలను అడుగుతుంటారు. ఆ piece meal విధంగా వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధ్యంకాదు. అందుకే ప్రథమంగా ఒక సమగ్ర ప్రణాళిక కావాలి. అటువంటి ఒక సమగ్ర సాధికార ప్రణాళిక రచన కోసం ఒక సాధికార కమీషన్‌ను వెంటనే నియమించాలి. ఆ సాధికార కమీషనులో సాగునీరు, వ్యవసాయం, గ్రామీణ జీవనోపాదులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు మొదలగు రంగాల నిపుణులు సభ్యులుగా ఉండాలి. 6నెలలూ లేదా ఒక సంవత్సరకాలంలో వెనుకబడిన ప్రాంతాల సమగ్ర, సమతుల అభివృద్ధి కోసం ఒక సాధికార ప్రణాళికను రచించాలి.

## 2. కొత్త రాజధాని మరియు పట్టిసీమపై చూపిస్తున్న అత్యుత్సాహముతో కొంత భాగమైన వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధి పై చూపించకపోవడం అభద్రతా భావాన్ని, అనుమానాలను, రాయలసీమలో ఆవేశాలను కూడా కల్పిస్తున్నది:

ప్రభుత్వము అత్యుత్సాహముతో దృష్టి అంతా రాజధాని మరియు పట్టిసీమ అంశములపైనే పెట్టి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం ముఖ్యంగా రాయలసీమ వాసులలో అభద్రతా భావానికి, అనుమానాలకు దారి తీస్తున్నది. అందుకు ప్రతి స్పందనగా మిగిలిన రాజకీయ పార్టీలు కూడా రాజధానితో, పట్టిసీమతో ముడిపడిన సమస్యలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గూర్చి తగినంతగా ఏ కరువు పెట్టకపోవడమూ రాయలసీమ వాసులను బాధిస్తున్నది. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తే మిగిలిన సమస్యలన్నీ తీరిపోతాయనే విధంగా, పట్టిసీమ నిర్మిస్తే రాయలసీమ సస్యశ్యామలమవుతుందనే విధంగా ప్రభుత్వం తీరు ఉండడం సాధారణ ప్రజలకు విస్మయాన్ని కల్గిస్తున్నది. పాలనావసరాలకు అవసరమైన రాజధాని కావాలని అందరూ కోరుకుంటున్నారు. అదనంగా తొమ్మిది ఉపనగరాలను అనగా విద్య, వైద్య, న్యాయ, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, సేవా సంస్థలు మొదలగు అన్ని రంగాల అభివృద్ధి కూడా రాజధాని చుట్టూ జరగాలని ప్రణాళికలు రూపొందించడం అనేక విమర్శలకు అనుమానాలకు దారి తీస్తున్నది. అదనంగా కోస్తా పారిశ్రామిక కారిడార్ (Coastal Industrial Coridar), ఓడరేవుల అభివృద్ధి మొదలగువాటికి అధిక ప్రాధాన్యతతో తీవ్ర ప్రయత్నాలు జరుగుచున్నవి. అంతేకాక 13వ షెడ్యూలులో కనపరచిన వివిధ సంస్థలు, హాస్పిటల్స్, మౌలికవసతుల కల్పనలో కూడా కోస్తా ప్రాంత జిల్లాలకు అత్యధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుచున్నది. పై ధోరణి రాయలసీమ జిల్లాలను ముఖ్యంగా అనంతపురం జిల్లాను నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన నెలకొని ప్రజలలో తీవ్ర నిరాశ నిస్పృహలు రేకెత్తిస్తున్నాయి.

## 3. ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర వాదన సాధారణ ప్రజలలో బలపడుచున్నది:

పైన చెప్పిన ధోరణులతో పాటు, హంద్రీనీవా, గాలేరు–నగరి లాంటి సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో రాయలసీమ తీవ్ర వివక్షకు, నిర్లక్ష్యానికి గురి అవుతున్నట్లు భావించడం జరుగుచున్నది. హంద్రీ నీవా, గాలేరు నగరి లాంటి సీమ ప్రాజెక్టులను ప్రక్కన పెట్టి, పట్టిసీమకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుచున్నది. తద్వారా ప్రస్తుత ప్రభుత్వ పని తీరు, కోస్తా నాయకుల ధోరణి చూస్తుంటే ఆంధ్ర ప్రాంతముతో కలిసి వుంటే, తిరిగి మోసపోతామని, ప్రత్యేక రాష్ట్రం వస్తేనే రాయలసీమ అభివృద్ధి అవుతుంది అనే వాదనకు బలం చేకూరుతున్నది. ఇటువంటి భావన సాధారణ ప్రజలతోపాటు, పాలక పక్షంతో సహా, అన్ని రాజకీయ పార్టీల నాయకులలోనూ మేధావులలోనూ, పౌర సంస్థలలోనూ కూడా బలపడుచున్నది.

రాజధాని నిర్మాణానికి పాలనావసరాలకు అనుగుణంగా నిర్మించుటకు ప్రాధాన్యతనిచ్చి పరిశ్రమల వికేంద్రీకరణకు, సాగునీటి పంపిణీలో అసమానతలు తగ్గించడానికి, మౌలికవసతుల కల్పనలో, కేంద్ర సంస్థల కేటాయింపులు, మొదలగు అంశాలలో ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వవలసిన సమయమిది. రాయలసీమ జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలు ఏ ఏ రంగాలలో వెనుకబడి వున్నాయో శాస్త్రీయ అధ్యయనం చేసి, కోస్తా జిల్లాలకు ధీటుగా వెనుకబడిన జిల్లాలను అన్ని రంగాలలోనూ సమగ్ర అభివృద్ధి చేయడానికి తగిన విధాన నిర్ణయాలతో పాటు ప్రాంతీయ న్యాయం దృష్టితో నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించాల్సిన సమయమిది. ప్రాంతీయ సమతుల సమగ్ర అభివృద్ధికి అత్యవసర ప్రాధాన్యత ఇచ్చి తగిన ప్రణాళికలు రూపొందించడానికి, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక సాధికార కమీషన్‌ను నియమించాల్సిన సమయమిది. ఈ అంశాలపైన పౌర సమాజంతో, ముఖ్య శ్రద్ధదారులైన రైతులు, నిరుద్యోగులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, మేధావులు మొదలగు వారితో చర్చించాల్సిన సమయమిది. అటువంటి చర్యలేవీ తీవ్రంగా తీసుకోకపోవడం ప్రాంతీయ వాదాన్ని బలపరుస్తూ, చాలా నిరాశ నిస్పృహలను మరియు ఆవేశాలను కూడా కల్గిస్తున్నది.

## 4. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన పొరపాట్లనే తిరిగి చేస్తున్నాము:

గత 25 సంవత్సరాలుగా అన్ని రంగాల అభివృద్ధి హైదరాబాదు చుట్టూ కేంద్రీకృతమై జరగడం ద్వారా విభజన కారణంగా మనం హైదరాబాదు కోల్పోయి చాలా నష్టపోవడం జరిగింది. అట్లాకాకుండా అభివృద్ధి వికేంద్రీకరణ జరిగి రాయలసీమ, ఉత్తరాంధ్రలలో కూడా సాగునీరు, వ్యవసాయం, పశుపోషణ, పాడి అభివృద్ధి, పరిశ్రమలు, పర్యాటక రంగము, పట్టణాల అభివృద్ధి, సంస్థల అభివృద్ధి మొదలగు రంగాలలో సమతుల అభివృద్ధి జరిగివుంటే, తెలంగాణా విడిపోయినా మనము ఇప్పుడు ఈ దుస్థితిలో వుండేవాళ్ళము కాదు. కేంద్రీకృత అభివృద్ధి అనే పెద్ద పొరపాటు నుండి మరి విభజనానంతరం ప్రస్తుత దుస్థితి నుంచి మనం ఏమి పాఠము నేర్చుకొన్నట్లు? తిరిగి అన్ని రంగాల అభివృద్ధి రాజధాని చుట్టూ, లేదా ఇప్పటికే అన్ని రంగాలలోనూ అభివృద్ధిలో ముందున్న కోస్తా ప్రాంతంలోని 4 జిల్లాలలో కేంద్రీకరించడం ఏ విధంగా సమంజసము? తెలంగాణా నుండి సీమాంధ్రను

విడగొట్టినట్లే, కోస్తాంధ్ర నుండి రాయలసీమ, ఉత్తరాంధ్రను కూడా ముందుకు విడగొడతారనే భావన బలంగా నెలకొనుచున్నది.

స్వాతంత్ర్యానికి పూర్వము నుండి కూడా రాయలసీమ ప్రజలకు కొంత కోస్తా ప్రాంత నాయకులపై అపోహలున్న మాట వాస్తవం. శ్రీబాగ్ ఒడంబడిక ఉల్లంఘనతోపాటు, సాగు నీటి విషయంలోనూ, ప్రాంతీయ అసమానతలు తొలగించే అనేక విషయాలలో నిర్లక్ష్యానికి గురై అనేక విధాలుగా మోసపోతున్నామనే భావన బలంగా వుంది.

ప్రస్తుత ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, ప్రయత్నాలు, అటువంటి భావనను తొలగించే బదులు ఇంకా బలపర్చేవిగా ఉంటున్నాయి. తద్వారా రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్దేశ్యంతో పౌర సమాజం నుండి అనేక చిన్న, చితక సంస్థలు పుట్టుకొస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలలోనూ అంతర్గతంగా ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కావాలనే వారు పెరుగుతున్నారు. మేధావులలోనూ, రచయితలు, కళాకారులలోనూ, పౌర సంస్థలలోనూ, చివరకు సాధారణ ప్రజలలో కూడా ఇటువంటి భావన బలపడే పరిస్థితులు చోటు చేసుకోంటున్నాయి.

## 5. రాష్ట్రాన్ని మరియొక్కసారి విడగొట్టడం పరిష్కారం కాకపోవచ్చు:

ఇప్పటికే తెలంగాణా-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అనేక వివాదాలు నిత్యమూ నడుస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటకలతో చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల వివాదాలు ముందునుంచి వుండనే వున్నాయి. ప్రత్యేక రాష్ట్రంగా రాయలసీమ విడిపోతే మరిన్ని వివాదాలు, భావోద్వేగాలు పెరిగి, సంక్లిష్టత పెరిగి, పరిస్థితి మరింత జటిలం కావడం ఖాయం. తెలుగు ప్రజల మధ్య వివాదాలు, వైషమ్యాలు, ఉద్వేగాలతో దూరం పెరగడం కూడా ఖాయం. తద్వారా రాయలసీమకు ఏమైనా ప్రయోజనాలు ఉంటాయని అనుకుంటే పొరపాటు కావచ్చు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రమేర్పడితే కొంతవరకు యిప్పుడున్న ఆవేశాలు చల్లారవచ్చు. కానీ నీటి వనరులు, విద్యుచ్ఛక్తి, సంస్థలు, రాష్ట్ర అప్పులు, ఇతర ఉమ్మడి ఆస్థుల పంపకాలలోనూ, నిర్వహణలోనూ ఏకాభిప్రాయం వచ్చే పరిస్థితే వుండకపోవచ్చు. ముఖ్యంగా నదీ జలాలు, విద్యుచ్ఛక్తి లాంటి కీలక వనరుల అనుదిన నిర్వహణలో అనేక వివాదాలు, ఆవేశాలు ఏర్పడతాయి. మూడు రాష్ట్రాల తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు, కొట్లాటలు నిత్యకృత్యంగా చోటు చేసుకునే పరిస్థితులు ఏర్పడవచ్చు.

శాస్త్రీయంగా ఆలోచిస్తే సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో చిన్న రాష్ట్రాలు శ్రేయస్కరం కానే కాదు. పెద్ద పెద్ద దేశాలు కూడా ఆర్థిక సమాఖ్యలుగా కలిసిపోయి, వనరులను జోడించుకొని, ఖర్చులు తగ్గించుకొని, ఏ విధంగా ప్రపంచ పోటీకి తట్టుకోవాలని తీవ్రంగా ఆలోచన చేస్తున్న సందర్భం. ఒక్కొక్క దేశానికీ ఉన్న వనరులను ఇతర దేశాలవనరులతో జోడించి, సమన్వయం చేసుకొని, అన్ని దేశాలు సమతులంగా అభివృద్ధి చెందే విధంగా సమిష్టిగా, సమాఖ్యలుగా సహకరించుకుంటున్న సందర్భం. యూరోపియన్ యూనియన్, బ్రిక్స్, ఆఫ్రికా ఫోరం, ఆసియా ఫోరమ్ లాంటి అంతర్జాతీయ సమాఖ్యలుగా కలయికలు జరుగుతున్న సందర్భం. విద్వేషాలతో విడిపోయి భేషజాలతో చీటికి మాటికి కొట్లాడుకొంటూ, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొడుతూ, అనాగరికంగా తిరోగమించడం ఏ మాత్రం సమంజసం కాదు, విజ్ఞత అంతకంటే కాదు. చిన్న రాష్ట్రాల

ప్రభుత్వాలు నిర్వహణ ఖర్చులను, రాజధాని నిర్మాణం, ఇతర మౌలిక వసతులకయ్యే ఖర్చులను భరించలేవు. గవర్నర్లు, మంత్రివర్గాలు, ఉద్యోగ వర్గాలకు అయ్యే జీత భత్యాలు కూడా భారమైపోయే పరిస్థితి. ఇక అభివృద్ధి ఎట్లా సాధ్యమౌతుంది?

## ౬. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వము చేపట్టవలసిన కనీస చర్యలు:

### ౬.1 వెనుకబడిన ప్రాంతాల ప్రజలలో నమ్మకాన్ని కల్గించే చర్యలు వెంటనే చేపట్టాలి.

అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా, ప్రాంతీయ అవసరాలకనుగుణంగా, ప్రాంతీయ అసమానతలు తొలగిపోయే విధంగా, ప్రభుత్వ విధి విధానాలు, ప్రణాళికలు, ప్రాధాన్యతలు, కార్యక్రమాలు రూపొందించవలసియున్నది. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర జిల్లాల సాధారణ ప్రజలలో తమ అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కట్టుబడి చిత్తశుద్ధితో, రాజకీయ సంకల్పంతో తీవ్రంగా పని చేస్తున్నాయనే నమ్మకాన్ని కల్గించవలసివుంది. ముఖ్యంగా గమనించాల్సిన అంశము ఏమంటే, ప్రభుత్వాలపైన రాజకీయ పార్టీల పైన ప్రజలకు నమ్మకము బాగా సన్నగిల్లింది. తెలంగాణా విడిపోయే సందర్భంలో వివిధ పార్టీల హామీలు, అదే సమయంలో వచ్చిన ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు గుప్పించిన హామీలు, కొత్త ప్రభుత్వాలు ఏర్పడి ఒకటిన్నర సంవత్సరమైనా నెరవేరని హామీలు మొదలగు పరిణామాలు రాజకీయ వ్యవస్థలపై ప్రజలలో నమ్మకాన్ని మరింత దిగజార్చినాయి. కాబట్టి కేవలం మాటలద్వారా గాకుండా నిర్దిష్ట చర్యల ద్వారా ప్రజలలో నమ్మకాన్ని కల్గించవలసి వుంది. ఇప్పటికే అభివృద్ధిలో ముందున్న కోస్తా ప్రాంత నాయకులు, మరియు ఆ ప్రాంత ప్రజల ఆలోచనలలో కూడా ఒక పరివర్తన రావాల్సిన అవసరముంది. ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి, సమ్మిళితంగా, అన్ని ప్రాంతాల ప్రజలు సగౌరవంగా జీవించడానికి అవసరమైన చర్యలు, విధానాలు రూపకల్పనలో వారు చొరవ చూపించాల్సిచ అవసరముంది. ముఖ్యమంత్రి ఏ ప్రాంతం వారైనా "రాజకీయ పలుకుబడి" కోస్థా ప్రాంతం చేతుల్లో వుంటుందనే భావన, నదీజలాల కేటాయింపులవంటి కీలక అంశాలలో వారి మాటే చెల్లుతుందనే భావన సాధారణ ప్రజలలో వున్నది. కాబట్టి వారు ప్రాంతీయ అసమానతలు తొలగించి, అన్ని ప్రాంతాలకు న్యాయం చేయడానికి, ఆ దిశగా ఇచ్చి-పుచ్చుకోవడానికి సిద్ధంగా వున్నామనే భావన కల్గించాలి. వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి పరచడానికి ఆర్థిక వనరులతోపాటు, సాగునీరు, తాగునీరు, మౌలిక సదుపాయాలు, సంస్థల మొదలగు వాటిని సమన్యాయంగా పంచుకోవడానికి రాజకీయ సంకల్పం కనపరుస్తూ, ఆవిధంగా వనరుల కేటాయింపులు చేస్తూ తగిన రాజకీయ నిర్ణయాలు, త్వరగా తీసుకొనవలసి వుంది. ఉదాహరణకు – ప్రాంతాల వారీగా నీటి కేటాయింపులు, మొదలగునవి రాజకీయ సంకల్పానికి, కఠినమైన రాజకీయ నిర్ణయాలకు సంబంధించిన అంశాలు. నదీజలాల వినియోగంలో పై తట్టు ప్రాంతములలోని ప్రాజెక్టులు పూర్తి కానపుడు మిగులు జలాలను కోస్తా ప్రాంతం వారు సహజంగానే ఇప్పటి వరకు అధికంగా వాడుకుంటున్నారు. సమన్యాయం ప్రాతిపదికగా నీటి కేటాయింపులు చేసినపుడు, అటువంటి కొన్ని నిర్ణయాలు కోస్తా ప్రాంతీయులకు కొంత అసౌకర్యంగా కూడా వుండవచ్చు. సమతల అభివృద్ధి లక్ష్యంగా కీలక వనరుల కేటాయింపులు లేకుండా, సమన్యాయం ప్రాతిపదికగా రాజకీయ నిర్ణయాలు లేకుండా, కేవలం తూతూ మంత్రంగా, అప్పుడు

కొన్ని-ఇప్పుడుకొన్ని చిన్న-చితకా కార్యక్రమాలకు కొన్ని నిధులను కేటాయించడము ద్వారా వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి జరుగదు. ప్రభుత్వాలు, పార్టీలు, రాజనీతిజ్ఞతతో ఆలోచించి, రాజకీయ సంకల్పంతో తగిన చర్యలు చేపట్టవలసి వుంది. లేకపోతే పరిణామాలు చేయి దాటిపోయి తీవ్రంగా వుండవచ్చు.

## 6.2 రాయలసీమ, మరియు ఉత్తరాంధ్ర జిల్లాల సమతల, సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కోసం వెంటనే ఒక సాధికార కమీషను వేయాలి:

వెనుకబడిన ప్రాంతాలలో జిల్లాల వారీగా వివిధ రంగాలపై లోతుగా అధ్యయనం చేసి, వెనుకబాటు తనానికి మూల కారణలను గుర్తించి, అన్ని జిల్లాలకు సమన్యాయం, సమగ్ర సమతుల అభివృద్ధి సాధించడానికి ప్రతి జిల్లాకు విడి విడిగా నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేయవలసివుంది. అటువంటి నిర్దిష్ట సమగ్ర ప్రణాళికలు తయారు చేయడానికి కీలక రంగాలలో నిపుణులతో కూడిన ఒక సాధికారక కమీషన్‌ను వేయవలసి వుంది.  వ్యవసాయం, సాగునీరు, పశుపోషణ, పాడి అభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, గ్రామీణ జీవనోపాదులు, సేవా సంస్థలు, మానవ వనరులు మొదలగు అంశాలలో నిపుణులను, అనుభవజ్ఞులను ఆ కమీషనులో సభ్యులుగా చేర్చి, " జిల్లా బహుళ రంగ సమతుల అభివృద్ధి ప్రణాళికా కమీషన్ " (District Multi-Sectoral Planning Commission for Equillable Development) ని వేయవలసి వుంది. ఆ కమీషన్ విస్తృతంగా వివిధ వర్గాల ప్రజలతోనూ, సంబంధిత అందరు శ్రద్ధదారులతోనూ, ప్రజాప్రతినిధులతోనూ, రాజకీయ పార్టీలతోనూ, మేధావులతోనూ, నిపుణులతోనూ లోతుగా చర్చలు జరిపి, సమస్యలను అర్ధము చేసుకొని, ప్రజల భాగస్వామ్యముతో, వారి స్థూల ఆమోదముతో జిల్లాలవారీ ప్రణాళికలు తయారు చేయవలసి వుంది. ప్రస్తుతము అమలు జరుగుచున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఎందుకు ఇవ్వడం లేదో కూడా కమీషన్ అధ్యయనం చేయవలసి వున్నది. కార్యక్రమాలలోని లోపాలను సరిదిద్దడంతో పాటు, కార్యక్రమాలు విజయవంతం కావడానికి అవసరమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, సాంఘిక పరిస్థితులు నిర్దేశించవలసి ఉన్నది.

ఇటువంటి ఒక సాధికార ప్రణాళిక ప్రతి జిల్లాకు లేనపుడు అభివృద్ధి సాధ్యం కాదు. చిన్నాచితకా కార్యక్రమాలతో, పిల్లలకు ఏడుపు మాన్పడానికి ఇచ్చే పప్పులు-బెల్లంలాగా కొన్ని నిధులను అప్పుడప్పుడు విడుదల చేయడం ద్వారా శాశ్వత సమగ్ర అభివృద్ధి సాధ్యంకాదు. కొన్ని నిధులు వస్తుంటాయి, ఆవిరై పోతుంటాయి కానీ, పరిస్థితిలో ఆశించిన మార్పురాదు. ప్రాధాన్యతలతో కూడిన నిర్దిష్ట ప్రణాళికలు లేకుండా కేవలం " అధికంగా" నిధులివ్వండని ప్రభుత్వాలను అడగడం భావ్యం కాదు. ఈ విధంగా గత 70 ఏండ్లుగా నానా రకాల కార్యక్రమాలు ముక్కలు ముక్కలుగా (piece meal) అమలవుతున్నాయి. కానీ జిల్లాలు అభివృద్ధి కాలేదు. అందుకే ఒక సమగ్ర సాధికార అభివృద్ధి ప్రణాళిక తప్పనిసరి. అటువంటి ప్రణాళికలు అమలు చేయుటకు అవసరమైన విధానా పరమైన నిర్ణయాలను తీసుకొని వనరులను కేటాయించి, ప్రణాళికలు అమలు చేయమని అడగడం, సాధించడం, జరిగినప్పుడే అభివృద్ధి దిశగా ముందుకు పోవడం జరుగుతుంది.

**6.3 పునర్వ్యవస్థీకరణ చట్టము 94 వ నిబంధన ప్రకారము సమగ్ర ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వంతో రాజీలేని లాబియింగ్ చేసి సాధించాలి:**

ఆవిధంగా తయారు చేసిన సమగ్ర సమతుల అభివృద్ధి ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టములోని 94వ నిబంధన క్రింద ఉన్న క్లాజుల ఆధారంగా, ప్రత్యేక హోదా ఆధారంగా అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో లాబీయింగ్ చేయవలసి ఉంది. తద్వారా సమగ్ర ప్రణాళిక అమలు గరిష్టంగా 5 సంవత్సరాల కాలవ్యవధి నిర్ణయించి, అవసరమైన నిధులను, కేంద్ర ప్రభుత్వాల నుండి సమీకరించవలసి వుంది. ఈ ప్రయత్నాలు గట్టిగా జరిగి, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు, నాబార్డు, బ్యాంకులు లాంటి ఇతర సంస్థలు సానుకూలంగా స్పందించి, ఆ దిశగా క్షేత్రస్థాయిలో చర్యలు కనపడినపుడు మాత్రమే ప్రజలలో ప్రభుత్వాలపైన, రాజకీయ వ్యవస్థలపైన విశ్వాసం ఏర్పడుతుంది. ఉత్తుత్తి మాటలతో, దిన దిన వాగ్దానాలతో ప్రజలలో నమ్మకం పెరగదు. ప్రణాళిక తయారు చేయుటలో భాగస్వామ్యం వహించినట్లే దానిని అమలు చేయడంలో కూడా భాగస్వామ్యం వహించే విధంగా ప్రజలను, ప్రభుత్వ అధికారులను, ప్రజా ప్రతినిధులను, రాజకీయ పార్టీలను, ఇతర సంస్థలను కూడా సమాయత్త పరచవలసి వుంది.

**6.4 ముగింపు:**

తక్షణమే ప్రతి జిల్లాకు ఒక బహుళరంగ సమతుల జిల్లా అభివృద్ధి ప్రణాళిక కమీషన్‌ను ( District Multi-Sectoral Planning Commission for Equillable Development)ను వేయుటకు అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, ఇతర పౌర సంస్థలు, మేధావులు, శాస్త్రజ్ఞులు, నిపుణులు ప్రభుత్వాన్ని ఒప్పించడమే తక్షణ కర్తవ్యము.